బస్సుయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి, భగవాన్‌దాస్

## చిరు వ్యాపారస్తులు లబ్ధి పొందాలి

గిర్మాజీపేట, జూలై 22: స్మాల్, మీడియం, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)లో చిరువ్యాపారులు రిజిస్ట్రేషన్ చేసుకొని లబ్ధిపొందాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. హంటర్‌రోడ్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు భగవాన్‌దాస్ ముండడ అధ్యక్షతన ఎంఎస్‌ఎంఈపై అవగాహన కలిగించేందుకు ఏర్పాటుచేసిన సమావేశానికి రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా వచ్చి ఎంఎస్‌ఎంఈ బస్సుయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరువ్యాపారులు సీఏల సూచనలు పాటిస్తూ వ్యాపారంలో ముందుకుసాగాలన్నారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డిని ఐసీఏఐ వరంగల్‌బ్రాంచ్ అధ్యక్షుడు భగవాన్‌దాస్‌ముండడ శాలువా కప్పి సత్కరించారు. వరంగల్ బ్రాంచ్ కార్యదర్శి ఎం సుజిత్, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ రామకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత

నర్సంపేట రూరల్, జూలై 22: నర్సంపేట పట్టణంలోని ద్వారకపేట ముస్లిం మైనార్టీ గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. జాస్మిన్, ఆఫ్రిన్ మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఉదయం ఆఫ్రిన్‌కు కడుపునొప్పి, జాస్మిన్‌కు తలనొప్పి ఉండడంతో సిబ్బంది పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. కాగా, గురుకులంలో టిఫిన్ సరిగా ఉడకలేదని, అది తిన్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

## కేజీబీవీలో దాశరథికి ఘన నివాళి

చెన్నారావుపేట, జూలై 22: మండల కేంద్రంలోని కేజీబీవీలో దాశరథి కృష్ణమాచార్యులు 99వ జయంతి నిర్వహించారు. సోమవారం దాశరథి జయంతి సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులకు దాశరథి సందేశాలను వివరించారు. చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులు అర్పించారు. ఎస్వో జ్యోతి, ఉపాధ్యాయులు తేజస్విని, షాహీన, రజిత, రజిని, పల్లవి, దేవిక పాల్గొన్నారు.

## మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శిగా అంజిత్‌రావు

కాశీబుగ్గ, జూలై 22: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ గ్రేడ్-2 కార్యదర్శిగా ధన్నపునేని అంజిత్‌రావు బదిలీ అయ్యారు. ఇటీవల మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా అంజిత్‌రావు భువనగిరి మార్కెట్ కమిటీ నుంచి వరంగల్ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఉత్తర్వులు జారీ కాగానే విధుల్లో చేరుతానని తెలిపారు.

## ముగ్గురు అధికారుల బదిలీ

ఖిలావరంగల్, జూలై 22: జిల్లాలో ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నర్సింహామూర్తి వరంగల్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు (కేవీఐబీ)కు, జిల్లా మత్స్యశాఖ అధికారి నరేశ్‌కుమార్‌నాయుడు పెద్దపల్లి జిల్లాకు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి భగవాన్‌రెడ్డి ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

## ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వరంగల్ చౌరస్తా, జూలై 22: ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ నాయకుల ఫోరం ఖిలా వరంగల్ మండల అధ్యక్షురాలు నేల మల్లమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, లేకుంటే మరో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఫోరం కార్యదర్శి మోహని, సభ్యులు స్వరూప, రజిత, సుధారాణి, నేలకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అగు అకోజు బ్రహ్మాచారి, తండ్రి: కృష్ణమూర్తి, వయస్సు: 54 సం||లు, వృత్తి: గోల్డ్ స్మిత్, నివాసం: ఇ.నెం. 19-12-27/5, కాశికుంట, వరంగల్ గారి ప్రకారం వివరించు విషయం ఏమనగా, నా క్లయింటు తన భార్య అగు అకోజు నాగమణి ద్వారా గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం. 534/2011 స.రి.కా. వరంగల్ (ఫోర్ట్) ద్వారా సంక్రమించిన ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్స్ 01-02-2023 రోజున కాశికుంట నుండి ఖిలా వరంగల్ పెట్రోల్‌పంప్‌కు నా యొక్క TVS విక్టర్‌పై వెళ్ళి వస్తుండగా పోయినవి. సదరు డాక్యుమెంట్‌ను నా క్లయింటు ఎక్కడ తనఖా పెట్టలేదని, ఎవరికి ఇవ్వలేదని ధృవీకరించగా నన్ను ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 534/2011 స.రి.కా. వరంగల్ (ఫోర్ట్) పోయినందున పత్రికా ప్రకటన ఇవ్వమని కోరగా ఈ ప్రకటన ఇస్తున్నాను.

షెడ్యూలు ఆస్తి: వరంగల్ జిల్లా మరియు పట్టణంలో కాశికుంట ప్రాంతంలోని RCC ఇల్లు నెం. 19-12-27/5, విస్తీర్ణం: 191.00 చ.గ.లు, ప్లింత్ ఏరియా 736 చ.ఫీట్లు గల దానికి హద్దులు తూర్పు: 12 ఫీట్ల రోడ్డు, పడమర: రోడ్, ఉత్తరం: నాగమణి మరియు శశికళ గారి ఇల్లు, దక్షిణం: ఇతరుల ఇల్లు.

తేది: 22-07-2024, వరంగల్.

ఇట్లు: **జి. వెంకటరత్నం,** M.A., LL.B
న్యాయవాది-నోటరీ
ఇ.నె. 11-26-1, కొత్తవాడ, వరంగల్.
సెల్: 9848621251

## మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

నెక్కొండ, జూలై 22: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో నెక్కొండ జడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎల్లో బెల్ట్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించారు. హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కాయితోజు సోనాలిక, 8వ తరగతి చదువుతున్న బల్ల ఐశ్వర్య అండర్-13 విభాగంలో ఎల్లో బెల్ట్‌లో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇక్బాల్‌ఖాన్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, ఆసరవెల్లి గ్రామ కాపురస్తులగు శ్రీమతి అజ్మీర సరోజ, భర్త: బద్రూ, నివాసం: గ్రామము: ఆసరవెల్లి, మండలం నల్లబెల్లి, జిల్లా: వరంగల్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నర్సంపేట బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిస్టర్ గిఫ్ట్ దస్తావేజు నెం. 3316/2024, తేది: 25-05-2024, సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిస్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (5) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, ఆసరవెల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని వార్డు నెం. 3, ఇంటి నెం. 1-78, విస్తీర్ణం: 242 చ.గ.లు సమము 202.34 చ.మీ.లు, ప్లింత్ ఏరియా 722.12 చ.ఫీ. గల దానికి హద్దులు: ఉత్తరం: భూక్య సరోజన గారి ఇల్లు & ఖాళీ స్థలం, దక్షిణం: భూక్య యాకు గారి ఇల్లు & ఖాళీ స్థలం, తూర్పు: 12 వెడల్పు గల రోడ్ & అజ్మీర బద్రు గారి ఖాళీ స్థలం, పడమర: భూక్య హలీమ్ గారి ఇల్లు & ఖాళీ స్థలం.

తేది: 22-07-2024,

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్,
మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

## ఆహార ప్యాకెట్ల పంపిణీ

గిర్మాజీపేట, జూలై 22: వర్షాలతో 28వ డివిజన్ సాయినగర్, సంతోషిమాత, బృందావన, ఎన్టీఆర్ నగర్‌కాలనీలు ముంపునకు గురికావడంతో డివిజన్ అధ్యక్షుడు కురిమిళ్ల సంపత్‌కుమార్ స్థానికులకు ఆహార ప్యాకెట్లను అందించారు. డివిజన్‌లో వరద ముంపు ప్రాంతాల్లో స్థానికుల సమక్షంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు డీఈ మల్లికార్జున్, ఏడీఈ శ్రీనివాసరెడ్డితో కాంగ్రెస్ నాయకులు నవీన్‌రాజ్ మాట్లాడా రు. వంగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని సూచించారు. పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ పాల్గొన్నారు.

**నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్**
(NAMASTHE TELANGANA CLASSIFIEDS)

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# ప్రజావాణికి 127 దరఖాస్తులు

- రెవెన్యూ శాఖవే అధికం
- సమస్యలను సకాలంలో పరిష్కరించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి

ఖిలా వరంగల్, జూలై 22 : వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి 127 దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా 74 రెవెన్యూ శాఖకు చెందినవే ఉన్నాయి. ఏడు ఎకరాలను కొడుకు రిజిస్ట్రేషన్ చేయించుకొని తన బాగోగులు చూసుకోవడంలేదని 105 ఏళ్ల వయసున్న పర్వతగిరి మండలం చౌటపల్లికి చెందిన పిడిచెట్టి రాధమ్మ తన కూతుళ్లతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తన భూమిని కొడుకు, మనుమడు రిజిస్ట్రేషన్ చేసుకొని మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేస్తున్నారని వేల్పుల నర్సయ్య భార్యతో సహా వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వీల్‌చైర్ ఇప్పించాలని లోహిత గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కనకలక్ష్మి దరఖాస్తు చేసుకుంది. గీసుగొండ మండలం మచ్చాపురంలో తన భూమి సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్న బంధువులు వనపర్తి ఈశ్వరయ్య, జనార్దన్, జ్యోతిపై చర్యలు తీసుకోవాలని వనపర్తి సాంబయ్య ఫిర్యాదు చేశాడు. హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీగా వచ్చి కలెక్టర్‌కు ఆశవర్కర్లు విజయమ్మ, రాణి, సునీత, పద్మ వినతి పత్రం సమర్పించారు. దుగ్గొండి మండలం మైసంపల్లిలో రైతులు తమ భూములకు వెళ్లేందుకు ఉన్న బండ్లబాటను పోతరాజు, దేవరాజు, భిక్షపతి కబ్జా ఆక్రమించుకుంటున్నారని రైతులు రాజన్న, మణెమ్మ, రాజబాబు, రవీందర్, శ్రీను కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖ సమగ్రశిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతిపత్రం సమర్పించారు. నర్సంపేట సహాయ కార్మికశాఖ అధికారి ఎండీ అలీ తీరు సరిగా లేదని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోవర్ధన్ కలెక్టర్ ఫిర్యాదు చేశాడు. పెండింగ్ స్కాలర్‌షిప్, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, మచ్చ పవన్‌కల్యాణ్, ప్రశాంత్, వినయ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మీసేవ కేంద్రాల్లో తరచూ తనిఖీలు చేయాలన్నారు. ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్య, ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

### 1వ తేదీ నుంచి వైద్య సేవలు అందించాలి

నర్సంపేటలో వైద్య కళాశాల, దవాఖానలో ఆగస్టు 1 నుంచి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్య కళాశాల హాస్పిటల్ నిర్మాణ పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇంకా ఏమైనా ఫినిషింగ్ పనులు ఉంటే ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. నర్సంపేట జిల్లా దవాఖానకు అవసరమైన మొత్తం పరికరాలు, ఫర్నీచర్ సమకూర్చాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా కల్పించాలన్నారు. ప్రొఫెసర్ రాంకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో నియమించిన ఏడు కమిటీలకు కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపాల్ కిషన్, టీజీఎం ఐడీసీ ఏఈ ప్రసాద్, బ్యాంక్ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై మట్టి తొలగింపు

కరీమాబాద్, జూలై 22: రోడ్డుపై మట్టిని అధికారులు సోమవారం తొలగించారు. రెండు రోజులపాటు వాన కురిసి వరంగల్ నుంచి ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారిలో మామునూరు వద్ద మట్టి కారణంగా నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వరంగల్ టు ఖమ్మం రహదారిలోని మామునూరు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించగా చేపట్టారు.

## బీరన్నస్వామి ఆలయ హుండీ లెక్కింపు

కరీమాబాద్, జూలై 22: గ్రేటర్ వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన బీరన్న దేవస్థాన హుండీ లెక్కింపు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం కరీమాబాద్ బీరన్నకుంటలోని ఆలయంలో చేశారు. హుండీ ద్వారా ఆదాయం రూ.25,470 నగదు వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మరుపల్ల రవి తెలిపారు. ధర్మకర్తలు యేర కోటేశ్వర్, నీల యాకయ్య, మండల ప్రమీల, కోరె అయిలయ్య, గౌడ కోటేశ్వర్, పూజారి బలభద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ సూపర్‌వైజర్లుగా బాధ్యతల స్వీకరణ

కాశీబుగ్గ, జూలై 22: వరంగల్ ఎనుమాముల ఏఎంసీలో సూపర్‌వైజర్లుగా ముగ్గురు, జేఎంఎస్‌గా మరొకరు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వర్ధన్నపేట మార్కెట్ కమిటీ నుంచి చక్రబహదూర్ రాయ్, నెక్కొండ మార్కెట్ కమిటీ నుంచి అల్లి జ్యోతిప్రకాశ్, నర్సంపేట మార్కెట్ కమిటీ నుంచి సూపర్‌వైజర్ ఎండీ సలీం, జేఎంఎస్ మేకల రజిత వరంగల్ మార్కెట్‌కు బదిలీపై వచ్చారు. తమ ఉత్తర్వులను కార్యదర్శి పోలెపాక నిర్మలకు అందజేశారు. అనంతరం శాలువతో కార్యదర్శిని సన్మానించారు. గ్రేడ్-2 కార్యదర్శి శ్రీరామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీలు రాజ్‌కుమార్, గంధమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు నల్ల నర్సింగరావు, గంగాధర్, భూక్య వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

## చెరువుల కబ్జాపై లోకాయుక్తలో ఫిర్యాదు

కాశీబుగ్గ, జూలై 22: గ్రేటర్ వరంగల్‌లోని పలు చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. చిన్నవడ్డేపల్లి చెరువు, బెస్తం చెరువు, కోటచెరువు, రామసముద్రం, కట్టమల్లన్న చెరువు, సాకరాసికుంట, హసన్‌పర్తిలోని చెన్నంగి చెరువులు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. సోమవారం లోకాయుక్తలో జరిగిన విచారణలో ఆయన హాజరై వాదన వినిపించినట్లు తెలిపారు. రెవెన్యూశాఖ అధికారులు హాజరు కాకపోవడంతో వాయిదా పడినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 30న లోకాయుక్తలో తదుపరి విచారణకు అధికారులను హాజరు కావాలని ఆదేశించినట్లు తెలిపారు.

## జిల్లాలో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం

ఖిలా వరంగల్, జూలై 22: వరంగల్ జిల్లాలో సగటున 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. నల్లబెల్లిలో 5.26 సెంటీమీటర్లు, గీసుగొండలో 3.86, దుగ్గొండిలో 35.2, నర్సంపేటలో 3.14, ఖానాపూర్‌లో 3.58, చెన్నారావుపేటలో 3.86, సంగెంలో 3.26, వర్ధన్నపేటలో 3.38, రాయపర్తిలో 2.48, పర్వతగిరిలో 1.62, నెక్కొండలో 3.12, ఖిలా వరంగల్‌లో 3.9, వరంగల్‌లో 4.54 నమోదైంది.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వర్ధన్నపేట, జూలై 22: మండలంలోని దమ్మన్నపేటలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలికట్టె నర్సయ్య భార్యతో కలిసి మండల కేంద్రంలోని బ్యాంకుకు వెళ్లాడు. ఇంట్లో నుంచి పొగ వస్తుండగా గ్రామస్తులు అతడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. స్థానికుల సహకారంతో మంటలను ఆర్పేశారు. అప్పటికే ఇంట్లోని నాలుగు పత్తిబస్తాలు, రెండు బస్తాల బియ్యం, దుస్తులు, రూ.5వేల నగదు, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి.

## జంక్షన్ సుందరీకరణ పనులు ప్రారంభం

కాశీబుగ్గ, జూలై 22: నగరంలోని 14వ డివిజన్ బాలాజీనగర్ జంక్షన్ సుందరీకరణ పనులు సోమవారం ప్రారంభించారు. స్మార్ట్‌సిటీ నిధులతో పలు జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వెంకట్రామ, నాయుడు పంపు జంక్షన్లు, మరికొన్ని అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

## రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

నెక్కొండ, జూలై 22: ఇటీవల బదిలీ అయిన రెవెన్యూ ఉద్యోగులు సుధాకర్, రఘును రెవెన్యూ ఉద్యోగులు, రేషన్‌డీలర్లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్‌ఐ నరేందర్, రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు గోరంట్ల వెంకటనారాయణ, రేషన్‌డీలర్లు పడాల శ్రీలత సురేందర్, సంతోష్, రమేశ్, వాగ్యానాయక్, అంబాల గోవర్ధన్, జనగం వెంకటనారాయణ, రవి, రాజేశ్, మహేందర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## ఖానాపురం ఎంపీఓగా సునీల్ బాధ్యతల స్వీకరణ

ఖానాపురం, జూలై 22 : ఎంపీఓగా అంబటి సునీల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నర్సంపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వర్తించిన సునీల్ ఇటీవల జరిగిన బదిలీల్లో ఖానాపురానికి బదిలీ కాగా ఖానాపురం ఎంపీవో రవి నల్లబెల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

## తుంగబంధం కాల్వకు గండి

నీట మునిగిన పొలాలు

తుంగబంధం కాల్వకు గండి పడి వృథాగా పోతున్న నీరు

ఖానాపురం, జూలై 22 : భారీ వర్షాలకు పాకాల ఆయకట్టు తుంగబంధం కాల్వ గండి పడింది. నీరంతా వృథాగా పొలాల్లోకి చేరింది. ఖానాపురం శివారులోని నర్రా పూర్ణయ్య బుర్ర సమీపంలో పెద్ద గండి పడింది. దీంతో ఇప్పటికే నాట్లు వేసిన 15 ఎకరాలు, వెదజల్లే విధానంలో వరి సాగు చేసిన మరో 10 ఎకరాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. గండిని వెంటనే పూడ్చి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు కోరారు.

## నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

నర్సంపేట రూరల్, జూలై 22: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, బిట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐబీఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఐటీ పరిశ్రమల్లో వినియోగించే అధునాతన, సాంకేతిక, కృత్రిమ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐబీఎం సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ హరిహరన్, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సలేంద్ర సురేశ్, కో ఆర్డినేటర్ నారాయణ పాల్గొన్నారు.

## మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- నర్సంపేట మున్సిపల్ సమావేశం

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జూలై 22: నర్సంపేట పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కోరారు. నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఉన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నందున పట్టణంలో పారిశుధ్యం లోపించిందని తెలిపారు. ఈ వానకాలంలో పారిశుధ్య సమస్యలు ఏర్పడకుండా చూడాలని, ఈగలు, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వచ్చిన నిధులతో వార్డుల్లో అభివృద్ధి పనులు చేయించనున్నట్లు తెలిపారు. వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కృషిచేస్తానని చెప్పారు. నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు, ఇతర పనులకు ఆమోదం తెలిపారు. కాగా, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మొక్కలు నాటి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ శుభకార్యాలు, ఇంట్లో జరిగే వేడుకలకు మొక్కలను నాటాలన్నారు. విద్యార్థుల తాగునీటి కోసం బోర్, మోటర్, ప్యూరిఫయర్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీ కిషన్, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్, విజయ్‌కుమార్, బత్తిని రాజేందర్, అంజలి, పెండెం లక్ష్మీరామానంద్, ములక వినోద, లక్ష్మణ్, సారయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 2019లో టేకు మొక్కలు నాటి పెంచిన ఏఎస్‌ఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్‌ను ఎమ్మెల్యే దొంతి అభినందించారు.

## డ్రైయినేజీలో చేపల వేట

డ్రైయినేజీలో చేపలు పడుతున్న యువకులు

కాశీబుగ్గ, జూలై 22: వర్షాలకు నగరంలో డ్రెయినేజీలు ఉప్పొంగాయి. 14వ డివిజన్ బాలాజీనగర్ వద్ద ఉన్న పెద్ద బాక్స్ డ్రెయినేజీలో వరద వస్తోంది. అందులో స్థానిక యువకులు వలలు వేసి చేపలు వేటాడుతున్నారు. గీసుగొండ మండలం గొర్రెకుంటతో పాటు పలు గ్రామాల వర్షపునీరు లేబర్‌కాలనీ, కీర్తినగర్‌కాలనీ, గరీబ్‌నగర్ నుంచి ఎస్‌ఆర్‌నగర్ మీదుగా వంద ఫీట్ల రోడ్డులో గల పెద్ద డ్రెయినేజీల ద్వారా భారీగా ప్రవహిస్తోంది. సాయిగణేశ్‌కాలనీ, మధురానగర్‌కాలనీ, లక్ష్మీగణపతికాలనీ నుంచి వర్షపు నీరు వచ్చి చిన్నవడ్డేపల్లి చెరువులో కలుస్తోంది.

## కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

రాయపర్తి, జూలై 22 : మండలంలోని పెర్కవేడులో నిమ్మల అనిల్‌కుమార్‌కు చెందిన 10 పొట్టేలు పిల్లలను వీధి కుక్కలు సోమవారం దాడి చేసి చంపాయి. గొర్రెల మందను మేత కోసం తన తండ్రి సోమయ్యతో కలసి అడవికి తోలుకెళ్లగా వీధి కుక్కల పొట్టేలు పిల్లలపై దాడి చేసి చంపేశాయని అనిల్‌కుమార్ తెలిపాడు.

# రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు

- రూ.2 లక్షల వరకు పంట రుణాలు
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట, జూలై 22: ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని డీసీసీబీలో రాయపర్తి, కొలన్‌పల్లి, వర్ధన్నపేట పీఏసీఎస్‌ల పరిధిలో రైతులకు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి కొత్తరుణాల చెక్కులను సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశలో రూ.లక్ష వరకు మాఫీ చేసిందని, ఆగస్టు 15లోగా రూ.2లక్షల వరకు మాఫీ చేస్తుందని చెప్పారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని మాట్లాడుతూ పంట రుణాలు మాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్ ఖన్నా, ఆయా సొసైటీల బాధ్యులు, రైతులు పాల్గొన్నారు.

### చెక్‌డ్యామ్ మరమ్మతులు వెంటనే చేపట్టాలి

ఆకేరువాగుపై చెక్‌డ్యామ్‌ను వెంటనే మరమ్మతులు చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. వర్ధన్నపేట పట్టణ సమీపంలోని ఇల్లంద ఆకేరువాగు చెక్‌డ్యాం కోతకు గురికావడంతో ఏటా నీరు వృథాగా పోతున్నది. గత ఏడాది స్థానిక అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ వరద భారీగా రావడంతో కోతకు గురై వృథాగా పోయింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందిస్తూ వాగుపై కోతకు గురైన చెక్‌డ్యామ్‌ను పరిశీలించారు. ఐబీ అధికారులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీరు నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



రైతులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

తహసీల్ కార్యాలయం ఎదుట ఉన్న బురద

## తహసీల్ ఆఫీస్ దారి బురదమయం

దుగ్గొండి, జూలై 22: తహసీల్దార్ కార్యాలయం ఆవరణ బురదమయంగా మారింది. ఏటా వానకాలంలో ఇదే పరిస్థితి ఉంటోందని ప్రజలు అంటున్నారు. తహసీల్దార్ ఆఫీస్‌తో పాటు ఎంపీడీవో, వ్యవసాయశాఖ, మహిళా సమాఖ్య కార్యాలయాలు ఇదే రోడ్డులో ఉండడంతో మండలంలోని ప్రజలు తమ సమస్యలపై నిత్యం వస్తుంటారు. బురదగా మారడంతో అటుగా వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై మొరం పోయించాలని కోరుతున్నారు.

## సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సురేందర్

ఖానాపురం, జూలై 22 : మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వరంగల్‌కు చెందిన గట్ల సుదర్శన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఐఐటీ స్టడీ సెంటర్‌లో గ్రేడ్-2 ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై గ్రేడ్-1 ప్రిన్సిపాల్‌గా సైనిక్‌స్కూల్‌కు వచ్చా రు. గతంలో అశోక్‌నగర్ గిరిజన పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించడంతోపాటు సీఓఈ వరంగల్, ఏటూరునాగారం, దామరవంచ, కొత్తగూడ, దమ్మపేట పాఠశాలలో విధులు నిర్వర్తించారు.

## 23.2 అడుగులకు పాకాల

ఖానాపురం, జూలై 22 : వర్షాలకు వరద భారీగా చేరడంతో మండలంలోని పాకాల సరస్సు 23.2 అడుగులకు చేరింది. పాకాల కట్ట, మత్తడి, తూములను తహసీల్దార్ కిరణ్‌కుమార్ సోమవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. సరస్సులోకి ఇంకా వరద వస్తున్నందున ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆర్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వ్యాస రచన పోటీల నిర్వహిస్తున్న వికాస తరంగిణి బాధ్యులు

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నర్సంపేట, జూలై 22: నర్సంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులు పాల్గొన్నారు. అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయని, విజేతలకు నగదు బహుమతులు ఉంటాని పేర్కొన్నారు. హెచ్‌ఎం కె.సారయ్య, ఉపాధ్యాయులు భిక్షపతి, శిరీష, కావ్య, ఉమామహేశ్వర్, రేణుక, త్రివేణి, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## తండావాసుల రాస్తారోకో

పర్వతగిరి, జూలై 22: మండలంలోని చింతనెక్కొండ శివారు బోటికాడి తండాకు చెందిన తారను హత్య చేశారని ఆరోపిస్తూ బంధువులు మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. మృతురాలు తారను సమీప బంధువే హత్య చేసి, పురుగుల మందు తాగించి ఆత్మహత్యగా చిత్రీకరించారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. పోలీసులు సరైన విచారణ చేసి కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మామునూరు ఏసీపీ తిరుపతి నేతృత్వంలో పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేశారు. దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై జీ వెంకన్న, ఏనుమాముల, గీసుకొండ సీఐలు పులి రమేశ్, బాబులాల్, మామునూరు ఎస్సై కృష్ణవేణి, నెక్కొండ ఎస్సై మహేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రంగాయ చెరువుకు జలకళ

నల్లబెల్లి, జూలై 22: భారీ వర్షాలకు మండలంలో పెద్దదైన, 16ఫీట్ల పూర్తి సామర్థ్యం గల రంగాయచెరువు మినీప్రాజెక్ట్ ప్రస్తుతం 11 ఫీట్లకు చేరింది. వెంకటపాలెం చెరువుతోపాటు కొండాపూర్‌కు చెందిన పసులోనికుంట, పెద్దచెరువు, పసులోనికుంట, ధర్మరావుపల్లికి చెందిన మంగళికుంట చెరువు మత్తడి దుంకుతున్నాయి. రంగాయచెరువు ప్రాజెక్ట్ కింద 1600 ఆయకట్టు ఉండగా రైతులు వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.

## వర్షాలకు కూలిన ఇంటి గోడ

చెన్నారావుపేట, జూలై 22: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో రైతు కోరె రాకేశ్‌కు చెందిన బావి కుంగింది. ఈర్యతండాకు చెందిన ధరంసోతు యాక, గుగులోత్ లాలు ఇంటి గోడ కూలింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

వర్ధన్నపేట, జూలై 22: దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇల్లందలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా? అంటూ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ ఎక్స్‌లో చేసిన పోస్ట్ చేయడంపై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సంఘం నాయకులు మహ్మద్ షరీఫ్, నర్సింహులు, సుమతి, శ్రీనివాస్, బాలకృష్ణ, మత్స్యగిరి, షారుణ్, వెంకన్న, ముత్తయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరెపల్లిలో బాధితులను పరామర్శిస్తున్న చల్లా ధర్మారెడ్డి

## బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గీసుగొండ, జూలై 22 : మండలంలోని కోనాయిమాకుల, ఆరెపల్లి గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కందారి సౌమ్య, సుధారాణి, రాజశ్వర్‌రావు, హరినాథ్ కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. గీసుగొండకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు కోట ప్రమోద్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, పార్టీ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శిరిశె శ్రీకాంత్, మాజీ సర్పంచులు పూండ్రు జైపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, గోలి రాజయ్య, కొల్పుల కట్టయ్య, రఘుపతిరెడ్డి, ముంత రాజయ్య, సంతోశ్, సొసైటీ చైర్మన్ ఆర్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.